అధికార్ల సంఘాలు, రకరకాల వృత్తుల వాళ్ల సంఘాలు, వినియోగదారుల సంఘాలు, మహిళా సంఘాలు, ఇవన్నీ కాక రోటరీ, లయన్స్ రోటరాక్టు, ఇంటరాక్టు, ఇన్నర్‌వీల్ క్లబ్బులు - అదెవరో అన్నట్టు ఇంచుమించుగా మనుషులెందరుంటే సంఘాలు కూడా అన్ని తయారయ్యేయి. అయితే నేను మాత్రం ఏ సంఘంలోనూ మెంబర్ని కాను. అంచేత అందరికీ మిత్రుడుగా, అజాత శత్రుడుగా ఉండగలుగుతున్నాను!"

"జీవి రంగనాథం "సంఘజీవి" కాదు; సంఘోపజీవి" అని నేను గ్రహించేసరికి కారు మా ఇంటికెదురుగా ఆగింది.

★

# 107. వర్క్స - పెర్క్స

మధ్యాన్నం ఒంటిగంట అవుతూ వుండగా చెమట్లు కక్కుకుంటూ ఉస్సూ, అస్సూ అంటూ వొచ్చాడు నరిసింగరావు మా ఆఫీసుకి. సరిగ్గా అప్పుడే నా భోజనం కేరియర్‌తో వచ్చాడు రాజన్న.

"అమ్మయ్య! సీట్లో ఉన్నావు. అదృష్టవంతుణ్ణే" అని తలెత్తి పైకి చూశాడు. "ఫేన్ తిరుగుతూనే ఉందా?" అని తన అలసట మీద తనే విసుక్కున్నాడు.

నేను టేబిలు క్లీను చేసుకుని భోజనం సరంజామా దానిమీద పేర్చుకుంటూ వుండగా "నువ్వు నాతో స్టేషన్‌కి రావాలి..." అన్నాడు.

"మళ్ళీ ఏదైనా పీకలమీదికి తెచ్చేవా?" అన్నాను.

"పోలీసుస్టేషన్‌కి కాదయ్యాబాబూ. రైల్వేస్టేషన్‌కి. నేను ఇవాళ సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదు వెళ్లాలి. నా టిక్కెట్టుకి వెయిటింగ్ లిస్టు నెంబరు తొంభై రెండువచ్చింది. నీకు తెలుసుగా. నేను నిలబడీ కూర్చునీ అంతదూరం ప్రయాణం చెయ్యలేను. రైల్వే డివిజనల్ ఆఫీసులో నీకు తెలిసిన వాళ్లున్నారు కదా. ఎమర్జన్సీ కోటాలో బెర్తు ఒకటి నాకు ఇప్పించాలి".

"ఓస్ ఇంతేనా!" అని రాజన్నకి సంజ్ఞచేసి పిలిచేను. "కేరియర్ నేనింటికి పట్టుకెళ్తాను గానీ, నువ్వు వెంటనే మీ ఇంటికి వెళ్లి; నీ భోజనం కానిచ్చి రైల్వేస్టేషన్‌కెళ్లు. ఈ అయ్యగార్ని చూసేవు కదా. ఇతనికి ఒక బెర్తు రిజర్వేషన్ చెయ్యి" అని చెప్పేను.

"నా టిక్కెట్ నెంబరు రాసివ్వనా?" అన్నాడు నరిసింగరావు. "అక్కర్లేదు బాబూ, ఇంతోటి దానికీ టిక్కెట్ నెంబరేల?" అని రాజన్న చెప్పేసరికి "స్టేషన్‌కి ఆటోలో వెళ్లు" అని నర్సింగరావు ఒక ఐదు రూపాయలనోటు రాజన్నకి ఇవ్వబోయాడు. రాజన్న ముక్కుమీద వేలేసుకుని "తప్పు, బాబయ్యా; అలాటోణ్ణిగాదు." అని వెళ్ళిపోయాడు.

నా భోజనం పూర్తయ్యేదాకా నరిసింగరావు కదల్లేదు. "నువ్వెళ్లు. భోజనం చేశావో లేదో. సూట్‌కేసు సర్దుకోవాలో ఏమిటో." అన్నాను. "నాకు ఆ రాజన్న మీద నమ్మకం లేదు. నువ్వొస్తే బావుణ్ణు" అని నసిగాడు. "సరే; నువ్వు రైలుకి వెళ్తూ ఇటు రా. నీతోబాటు నేనూ స్టేషన్‌కొచ్చి నిన్ను రైలెక్కిస్తాను. నువ్వు తెల్లవార్లూపడుకొని ప్రయాణం చేసేటట్టు చూసే పూచీ నాది. సరా?" అని నేనన్నాక వెళ్లేడు.

రైల్లో, నిద్రవేళదాకా కూర్చోడానికి కిటికీ పక్కసీటు, నిద్రరాగానే పడుకుందికి "బెర్తు" (జనరల్ కంపార్టుమెంట్‌లో) ఏర్పాటు చేసేడు రాజన్న. నరిసింగరావు "ఇదే బాగుందే! ముప్పయి రూపాయలు

మిగిలేయి కూడాను.'' అని రాజన్నని దగ్గిరిసా పిలిచి, వాడి చేతిలో ఒక ఐదు రూపాయల నోటు పెట్టబోయాడు. రాజన్న దూరంగా తప్పుకున్నాడు.

"ఏదో సంతోషం కొద్దీ ఇస్తానంటే వాడు పుచ్చుకోడేం?'' అన్నాడు నరిసింగరావు.

"టైముంది కదా. నీకో కథ చెప్తాను'' అన్నాను. "అనగా అనగా, ఒక ఫాన్సీ సామాను-కమ్-ఆట వస్తువుల షాపు. అందులో పనిచేసే ఒక కుర్రాడు. షాపు యజమాని ఓరోజు భోజనానికి వెళ్లొచ్చేసరికి షోకేసులో ఎదురుగా కనపడవలసిన ఒక బొమ్మలేదు. ఏదిరా, ఆ బొమ్మ - అని యజమాని అడిగేడు. అమ్మేశాను సార్ అన్నాడు కుర్రాడు. ఎంతకి అమ్మేవూ అన్నాడు యజమాని. దానిమీద యాభై అంకె వుంది కదా; అంచేత యాభై పైసలకి అమ్మేశానండి - అని జవాబు. ఓరి బడ్డూ! దాని అమ్మకం ధర యాభై రూపాయలురా, అని యజమాని కోప్పడ్డాడు. కుర్రాడు అతని కాళ్లమీద పడి, బాబూ పొరపాటైపోయింది; నా ఉద్యోగం తీసేకండి; ఆ నష్టం నా జీతంలోంచి విరక్కొట్టుకోండి - అన్నాడు. యజమాని వాణ్ణి లేవదీసి; ఫరవాలేదులే. అప్పటికీ మనకి పదకొండు పైసలు లాభమే - అన్నాడట'' అని చెప్పేను.

"దానికీ దీనికీ పోలికేమిటి?''

"ఒస్తున్నా. ఈ రాజన్న ఉన్నాడా! వీడు మా ఆఫీసులో కళాసి. మొత్తం పన్నెండు పోస్టులు. వీడు మాత్రం నా స్వంతపనులకి ప్రత్యేకం. రోజూ పిల్లల్ని స్కూలుకి దిగబెట్టడం, పోస్టాఫీసుకెళ్లి ఉత్తరాలు తేవడం, నాకేరియర్ తేవడం, మళ్లీ ఖాళీ కేరియర్ పుచ్చుకుని స్కూలుకెళ్లి పిల్లల్ని ఇంటికి తీసికెళ్లడం - ఇవీ వాడి డ్యూటీలు. జీతం నెలకెనిమిది వందలు! అప్పుడప్పుడు మా ఆవిడ వాణ్ణి సినిమాహాలుకి టిక్కెట్లకోసం పంపినాసరే-ఏం అనుకోడు''.

"ఆహా!'' అన్నాడు నరసింగరావు.

"మా సూపరింటు గారి దగ్గిర తిరపతి అని ఒక ప్యూనున్నాడు. వాడికి తొమ్మిది వందల ఎనభై రూపాయలు జీతం. వాడు కూడా ఆఫీసు పనేమీ చెయ్యడు.'' అని చెప్పేను.

"మరి?''

"వాడి అప్లికేషన్‌లోనే వాడి కులం చాకలి అని వుంది. అంతే. వాడు రోజూ సూపర్‌గారింటికి వెళ్లి సూపర్ డిటర్జెంటు ఒకటి అర్జంటుగా తీసుకుని ఇంట్లోవున్న ఎనిమిది మంది బట్టలూ ఉతికి ఆరేసి ఇస్త్రీ చేసి వెళ్లిపోతాడు. నెలాఖర్ని జీతానికి మాత్రం వస్తాడు. ఆఫీసుకి''.

"అబ్బా, చాలా బావుందే!'' అని పక్కనించి వెళ్తున్న కాఫీ బండిని ఆపి రెండు కాఫీ చెప్పేడు నరిసింగరావు. ఇద్దరం తాగుతూ వుండగా నేను మా జెనరల్ మేనేజరుగారి సంగతి కూడా నరిసింగరావుకి చెప్పేశాను. గురువులు అని మా ఆఫీసులో ప్యూన్‌గా ఉండేవాడు. జీతంలో సగం తాగేసేవాడు. అలా ఆయుష్షులో సగంపోగా ఆ మధ్య చచ్చిపోయాడు. గురువులి పెళ్లాం తనకేదైనా ఉపాధి చూపించమని మొరపెట్టుకుంది. జి.ఎం.గారి బంగళాలో "స్వీపర్-కమ్-వాటర్ మెయిడ్'' అని ఒక పోస్టు సృష్టించి అందులో వేసేరు. ఔట్‌హౌసులో ఉండడానికి వసతి ఇచ్చేరు. ఆవిడకి మొగుడి సర్వీసుకి సంబంధించిన పెన్షను; తన జీతం రెండూ కలిపి పన్నెండు వందల యాభై కిడతాయి. మా జి.ఎమ్.గారి భార్యకి ఇంట్లో వుంటే ఒంట్లో బావుండదు; వీధిలో కెళ్తే ఇల్లు గుర్తురాదు. అంచేత బంగళా మెయింటెనెన్సు అంతా కనకలక్ష్మి మీదనే పడ్డాది. ఉదయం పాలు తేవడంతో

మొదలెట్టి కాఫీచేసి అమ్మగార్నీ అయ్యగార్నీ లేపడం నుంచి - వంటలు చెయ్యడం వగైరా అన్ని పన్లూ చేసి రాత్రి భోజనాలు అయ్యేక పక్కలు వెయ్యడం పక్క లెక్కించడం వరకూ మేడమ్‌గారికి మారుగా చెయ్యవలసిన పన్లన్నీ కూడా ఒళ్లు దాచుకోకుండా చేస్తుంది పాపం!''

బండికి సిగ్నల్ ఇచ్చేరు. ఈలలు వేసేరు. ఎనౌన్సుమెంట్ కూడా వచ్చింది. నరిసింగరావు "టాటా''గా చెయ్యి ఊపేడు. గార్డు జెండాకూడా ఊపేడు.

"ఇంతకీ నువ్వు హైదరాబాదు ఎందుకు వెళ్తున్నావు?'' అన్నాను.

నరిసింగరావు నవ్వేడు. "అది సీక్రెట్టు. ఇప్పుడు చెప్పకూడదు.'' అన్నాడు.

★ ★ ★

ఆ తరవాత వారం రోజులకి మా జి.ఎమ్.గారు నరిసింగరావుని వెంటబెట్టుకుని నా సెక్షన్‌కి వచ్చేరు. "లుక్ హియర్! ఈయన నర్సింగ్రావ్; మన ఆఫీసులో ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఇవాళే జాయినయ్యారు.'' అని అందరికీ అతన్ని పరిచయం చేసేరు.

"ఇంటర్ వ్యూకి వెళ్తున్నట్టు కూడా నాకు చెప్పలేదు!'' అని నరిసింగరావుని నిష్ఠూరం ఆడేను.

"వెళ్లేముందు ఈ సెలక్షన్ వచ్చినా జాయినయ్యే ఉద్దేశం పెద్దగాలేదు. కాని ఈ కంపెనీలో "పెర్క్స్'' సంగతి నీద్వారా విన్నాక ఇదే బావుందని ఒప్పేసుకున్నాను'' అన్నాడు నరిసింగరావు; మా కొత్త ఎ.డి.వో.

★

# 108. సగర్వంగా సగం

ఆ మధ్య ఒక సినిమాలో ఒక పాత్రకి "సగంచాలు!'' అనే ఊతపదం ఏర్పాటు చేసి తద్వారా కొంత హాస్యం ఉత్పత్తి చేసేరు. ఇది ఒక స్త్రీ పాత్ర. ఆవిడతో ఎవరూ ఏం మాట్లాడినా, "అంతెందుకు, సగంచాలు!'' అంటుంది. ఎవరింటికైనా పలకరించడానికి వెళ్తే అతిథి మర్యాదల్లో భాగంగా ఆవిడకి ఒక కప్పుకాఫీ ఇవ్వబోతే "అంతెందుకు, సగం చాలు'' అంటుందన్నమాట. "మొన్న మీరు మీ అమ్మాయికి పిఠాపురం నుంచి సంబంధం తెచ్చేరు కదా; ఏమయింది?'' అని ఈవిడ వాళ్లని పరామర్శ చేసినప్పుడు ఆ ఇంటివాళ్లు ఆ పెళ్లిచూపుల ఉదంతాన్ని "అబ్బో! చాలా గొడవైంది లెండి.'' అని అదంతా వివరించి చెప్పబోతే, "అంతెందుకు; సగం చాలు!'' అని తన ఆమోదాన్ని వ్యక్తపరిచేసింది. "ఒక ఎడ్రసు రాసుకోవాలి, కాగితం ఇ''మ్మని అడిగినప్పుడు పావుటావు కాగితం యివ్వబోతే "అంత ఎందుకు, సగం చాలు!'' అంటుందన్నమాట. ఓసారి ఇలాంటావిడ ఒకరు అనుకోకుండా మా ఇంట్లో నైట్ హాల్టు ఉండిపోవలసి వచ్చింది. "మారుచీర తెచ్చుకోలేదు'' అని ఆవిడ అనగానే మా ఇల్లాలు "దానికేం భాగ్యం'' అంటూ ఒక మడత చీరతెచ్చి ఇవ్వబోయింది. ఇంతలో మా కోడలు అడ్డుపడి; "అంతెందుకు అత్తగారూ, సగం చాలు:'' అని అందర్నీ నవ్వించింది.

ఏది ఎలావున్నా కాఫీ విషయంలో "సగంచాలు'' అనేది ఇప్పటికీ జీవించే ఉంది. మన ఇళ్లకి అతిథులుగా వచ్చేవాళ్లకి కాఫీ ఇస్తాం కదా. "అయ్యబాబోయ్, అంత కాఫీ తెచ్చేసేరేంటండోయి. ఇంకో కప్పు తెచ్చివ్వండి; ఇందులో సగం మీకు ఇచ్చేస్తాను'' అని అనడం వుంది. వాళ్లు ఒక కప్పు కాఫీని "ఏక్‌దమ్''లో తాగలేనంత నాజూకు నవనాగరికులని ప్రకటించుకోడంతో బాటు, మన